

బీసీలకు సముచిత స్థానం కల్పించింది జగనన్నే

బీసీలకు సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్ జగనన్నేనని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. - 8లో..



వెంటాడుతున్న విభజన గాయాలు

రాష్ట్ర విభజన గాయాలు నేటికీ వెన్నాడుతున్నాయని చరిత్రకారుడు డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పేర్నమిట్ట స్థలాన్ని పరిశీలించిన ఏకేయూ వీసీ



యూనివర్శిటీ స్థలాన్ని పరిశీలిస్తున్న వీసీ

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా యూనివర్శిటీ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన యూనివర్శిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన పేర్నమిట్టలోని స్థలాన్ని ఆయన సందర్శించారు. 109.80 ఎకరాల స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేయడానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సహకారంతో తీసుకుంటామని చెప్పారు. స్థానిక కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్లు అన్నీ శ్రమదానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట స్పెషలాఫీసర్ డాక్టర్ బి.కృష్ణ, హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ డి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ యం.హర్ష ప్రసాద్, ప్రీతమ్ దేవీ కుమార పాల్గొన్నారు.

'వైఎస్సార్ చేయూత'లో రైతులను భాగస్వాములను చేయాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న జేడీ బేబీరాణి

టంగుటూరు: వైఎస్సార్ చేయూత పథకంలో ఎక్కువ మంది రైతులను భాగస్వాములను చేసి, లబ్ధి పొందేలా చూడాలని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి ఆదేశించారు. స్థానిక పశువైద్యశాలను జేడీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుపోషకులకు సబ్సిడీపై టీ.ఎం.ఆర్, కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు సేవలు, పథకాలు వివరించాలన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని వినతి



డీఈవోను కలిసిన టీచర్స్ గిల్డ్ నాయకులు

ఒంగోలు టౌన్: మార్కాపురం శివసాయి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వెంకటరావు కోరారు. జిల్లాలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీటీజీ నాయకుడు డీఈఓ పి.రమేష్‌ను, ఏడీ సురేఖ, డిప్యూటీ డీఈవో అనిత రోజీలను కూడా కలిసి కలిసి వినతి పత్రం అందజేశారు. అధికారులను కలిసి వారిలో గిల్డ్ కార్యదర్శి సీహెచ్.ప్రభాకరరెడ్డి ఉన్నారు.

రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ

ఒంగోలు సబర్బన్: రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులను జాయింట్ కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి రోజూ నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని స్టోన్ ప్లాంటేషన్ చేయాలన్నారు. రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. 19 గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ప్రతి గ్రామంలో 3 బృందాలుగా ఏర్పడి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయం రెవెన్యూ అంశాలపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్ ఉషారాణి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డితో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

ఉపాధికి వెలుగురేఖ

ఉద్యోగం సాధించాలంటే టెక్నాలజీకి అవసరమైన నైపుణ్యం కావాలి. ఎంచుకున్న రంగంలో వృత్తి నైపుణ్యం సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం యువతరానికి వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తూ ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. నిరుద్యోగ యువత సొంతకాళ్లపై నిలబడేలా ఉపాధి చూపుతోంది. జిల్లాలో నియోజకవర్గానికో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి నైపుణ్య శిక్షణ ఇస్తోంది. అంతేకాదు పలు కంపెనీల సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది.

జిల్లాలో స్కిల్ హబ్‌లు: 10	శిక్షణ కేంద్రాలు: 2	స్కిల్ కళాశాల: 1
జాబ్ మేళాలు: 115	ఉద్యోగాలు సాధించిన వారు: 7405	

- వృత్తి నైపుణ్య శిక్షణలతో ఉపాధి అవకాశాలు
- యువతకు ఉద్యోగాల వెల్లువ
- జిల్లాలో గుర్తించిన 14 రంగాల్లో శిక్షణ
- స్కిల్ హబ్ ద్వారా నైపుణ్యాల మెరుగుదల





సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

చిన్న చదువో, పెద్ద చదువో చదువుకుని ఉద్యోగం, ఉపాధి లేని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తూ యువత సొంత కాళ్లపై నిలబడేలా ఉపాధి చూపుతోంది. యువతకు జిల్లాలో ఉన్న వనరులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోనే ఉపాధి కల్పించేలా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చర్యలు చేపట్టారు. గుర్తించిన 14 రంగాల్లో వివిధ రకాల నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఒకే ఒక స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభించింది. స్థానిక యువత శిక్షణలు పొందేలా చక్కటి అవకాశం కల్పించింది. దీంతో నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్య శిక్షణలపై ఆసక్తి చూపుతోంది.

శిక్షణ ఇచ్చే అంశాలు ఇవీ...

పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిగ్రీ తదితర విద్యార్హతలు ఉన్న యువతకు ఎలక్ట్రీషియన్ డొమస్టిక్ సొల్యూషన్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, కుట్టు మిషన్, డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్, ప్లంబర్, ఫీల్డ్ టెక్నీషియన్, ఫిట్టర్ ఫేబ్రికేషన్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ బ్యూటీ థెరపీ, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్, కస్టమర్ కేర్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. గతంలో కేవలం శిక్షణ మాత్రమే ఇచ్చి భవిష్యత్‌ను పట్టించుకునే వారు కాదు. వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక శిక్షణతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 115 జాబ్ మేళాలు నిర్వహించి 7,405 మందికి ఉద్యోగాలు కల్పించారు. వాటిలో మినీ జాబ్‌మేళాలు 100, మేజర్ జాబ్‌మేళాలు 15 నిర్వహించారు. శిక్షణ పొందిన వారు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, చెన్నై తదితర పట్టణాల్లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఒంగోలు నగరంలో బాలురు, బాలికల ఐటీఐల్లో రెండు శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. బాలికల ఐటీఐలో ప్రత్యేకంగా మహిళల కోసం హౌసింగ్, ఎలక్ట్రీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరో కేంద్రంలో ఇండస్ట్రియల్, ఫిట్టర్ ఎరోకేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. గిద్దలూరులో సెక్యూరిటీ గార్డు, టెలీకాలర్స్, కొండపిలో రిటైల్ అసిస్టెంట్, అసిస్టెంట్ బ్యూటీషియన్, దర్శి, మార్కాపురంలో ఇండస్ట్రియల్ విభాగంలో శిక్షణ ఇస్తున్నారు. సంతనూతలపాడులో సీయింగ్ వెకేషన్, బ్యూటీథెరపిస్టులో శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణతో పాటు ఉపాధి



జిల్లాలో యువతకు నైపుణ్య శిక్షణలతో పాటు ఉపాధి కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వివిధ కంపెనీలతో జాబ్ మేళాలు నిర్వహిస్తూ వేలాది మందికి ఉద్యోగాలు కల్పించేలా చూస్తున్నాం. కలెక్టర్ నైపుణ్య శిక్షణ తరగతులు, జాబ్‌మేళాలు తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆ మేరకు యువతకు ఉపాధి మార్గాలు చూపేందుకు కృషి చేస్తున్నాం.

– లోకనాథం, ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి

యువత నైపుణ్యం పెంచుకుని ఉపాధి పొందాలి



జిల్లాలో యువత ఉద్యోగాల అన్వేషణతో సరిపెట్టుకోకుండా నైపుణ్యం పెంచుకుని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణలు ఇస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలి. నైపుణ్య శిక్షణే కాకుండా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విరివిగా కల్పిస్తున్నాం.

– ఏఎస్.దినేష్‌కుమార్, జిల్లా కలెక్టర్

క్రికెట్ సంబరం ప్రారంభం

- ఉత్సాహంగా మొదలైన ఎస్‌పీఎల్ రీజినల్ క్రికెట్ పోటీలు
- తొలి రోజు ఆరు జట్ల మధ్య రసవత్తర పోరు

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE — Regional sponsor: APMDC, APMDC FOUNDATION



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైస్ చాన్సలర్ నాగభూషణం, రిజిస్ట్రార్ డాక్టర్ రఘునాథన్

చేబ్రోలు (పొన్నూరు): సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) రీజినల్ స్థాయి జూనియర్స్, సీనియర్ పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ ఆలోచనలకు బ్రేక్ ఇవ్వకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. విజయాన్ని, ఓటమిని సరిసమానంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడపై మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాల అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచ్ మేనేజర్ టి.గోపి పర్యవేక్షించారు.

ఉత్కంఠ పోరులో ఎన్ఆర్ఐ విజయకేతనం

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ రీజినల్ రెండో మ్యాచ్‌లో భాగంగా ఉమ్మడి కృష్ణా ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్, నెల్లూరు వివేకానంద జూనియర్ కాలేజ్ జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. ఆద్యంతం మ్యాచ్ నువ్వా.. నేనా అన్నట్లు నడిచింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 61 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ ఇక్తాన్ సింగ్ 19 పరుగులు, ఎం.రూపేష్ 17 పరుగులతో రాణించారు. బౌలర్లలో ఎస్‌కే వారీషా రెండు వికెట్లు తీశారు. అనంతరం 62 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన వివేకానంద జూనియర్ కళాశాల జట్టు 9.5 ఓవర్లలో 50 పరుగులకు ఆలౌటై 11 పరుగుల తేడాతో ఓటమి చెందింది. ఎన్ఆర్ఐ బౌలర్ ఎస్‌కే జాఫర్ 4 వికెట్లతో రాణించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచారు.

సీఆర్‌రెడ్డి ఘన విజయం:

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ రీజినల్ మొదటి మ్యాచ్‌లో భాగంగా ఏలూరులోని సీఆర్‌రెడ్డి, ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. సీఆర్‌రెడ్డి బ్యాట్స్‌మెన్‌లలో వి.గగన్ కుమార్ 20 పరుగులు, కె.నాగవెంకట్ 20 పరుగులతో రాణించారు. పేస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు బౌలర్లలో కె.సాయి కుమార్ 2 వికెట్లతో సత్తా చాటారు. అనంతరం 70 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పేస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 8.5 ఓవర్లలో 27 పరుగులకు ఆలౌటై 43 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. సీఆర్‌రెడ్డి బౌలర్లలో ఎ.నిఖిల్ 4 వికెట్లతో రాణించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచారు.

మొదటి మ్యాచ్‌లో కల్లం బోణి..

రీజినల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ ఒంగోలు పేస్ డిప్లమో కాలేజీ, గుంటూరులోని కల్లం హరనాథరెడ్డి కాలేజ్ జట్ల మధ్య జరిగింది. కల్లం హరనాథరెడ్డి కళాశాల జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఒంగోలు పేస్ డిప్లమో కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. కల్లం హరనాథరెడ్డి కాలేజ్ బౌలర్ అవినాష్ 2 వికెట్లతో రాణించారు. అనంతరం 71 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కల్లం హరనాథరెడ్డి కాలేజ్ 9.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నందు ఎంపికయ్యారు. నందు బ్యాటింగ్‌లో 21 (3 ఫోర్లు, 1 సిక్స్) పరుగులతో రాణించారు. బౌలర్లలో ఎంఎస్ బాలాజీ 2 వికెట్లతో సత్తా చాటారు.

నేటి మ్యాచ్‌లు

- జూనియర్స్ విభాగంలో ఏలూరు సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల వర్సస్ గుంటూరు కల్లం హరనాథరెడ్డి కళాశాల
- రీజినల్ సీనియర్స్ ఫైనల్ మ్యాచ్ నెల్లూరు ఎన్‌బీకేఆర్ వర్సస్ ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల
- రీజనల్ జూనియర్స్ ఫైనల్ మ్యాచ్ మొదటి మ్యాచ్ విజేత వర్సస్ ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల జట్ల మధ్య



గెలుపొందిన క్రీడాకారులు కల్లం హరనాథరెడ్డి కళాశాల, గుంటూరు



గెలుపొందిన క్రీడాకారులు ఎన్నారై కళాశాల, విజయవాడ



గెలుపొందిన క్రీడాకారులు సీఆర్‌రెడ్డి కళాశాల, ఏలూరు

పట్టభద్రులకు 5 నామినేషన్లు దాఖలు

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ మంగళవారం కొనసాగింది. ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రకాశం జిల్లాకు చెందిన కిరణ్ దాసరన్న మట్టిగుంట (41, ఇండిపెండెంట్), ప్రకాశం జిల్లాకు చెందిన మాదసి జాలారావు (41, ఇండిపెండెంట్), తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తరుపున (36, బీజేపీ అనుబంధం) జగదీశ్వర్‌నాయుడు, ప్రకాశం జిల్లాకు చెందిన భాస్కరరావు కమ్మిశెట్టి (36, ఇండిపెండెంట్), తిరుపతి జిల్లా వాకాడు మండలానికి చెందిన బొట్టి కాయల చంద్రశేఖర్ (40, ఇండిపెండెంట్)గా మొత్తం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణ మొదలైన రోజు నుంచి మంగళవారం వరకు పట్టభద్రులకు 7, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 1, స్థానిక సంస్థలకు 0 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 23 వ తేదీ వరకు అవకాశం ఉంది.

నేడు అట్టహాసంగా నామినేషన్లు:

వైఎస్ఆర్ సీపీ బలపరచిన అభ్యర్థులు బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేయనున్నారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి బుధవారం నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని గాంధీ సర్కిల్ నుంచి ఉదయం 8.30 గంటల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేయనున్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రకాశం జిల్లా అభ్యర్థి భాస్కరరావు

బీసీలకు సముచిత స్థానం కల్పించింది జగనన్నే

● ఎమ్మెల్సీ పోతుల సునీత


ఎమ్మెల్సీ సునీత దంపతులకు అభినందనలు తెలుపుతున్న చేనేత ఐక్యవేదిక నాయకులు

చీరాల: రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ తనను ఎమ్మెల్సీగా మూడోసారి నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు సముచితమైన పదవులు అందించారన్నారు. ఎమ్మెల్సీలుగా 18 మందిని నియమించగా వారిలో ఎక్కువ మంది బీసీలు ఉన్నారన్నారు. సమన్యాయం పాటించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అగ్రకులాలకే పెద్దపీట వేశారన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగానే చూశారని, గత ప్రభుత్వ హయాంలో సమన్యాయం జరగలేదన్నారు. రానున్న ఎన్నికల్లో 175కి 175 సీట్లు వైఎస్సార్ సీపీ గెలవడం తథ్యమన్నారు. ఆ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. అలానే చేనేత సామాజిక వర్గానికి చెందిన పోతుల సునీత మూడోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు చేనేత ఐక్యవేదిక తరుపున కోస్తా జిల్లాల సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అండగుండ నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అలానే ఎమ్మెల్సీ పోతుల సునీతను కలిసి అభినందనలు తెలిపారు.

వెంటాడుతున్న విభజన గాయాలు


సదస్సులో ప్రసంగిస్తున్న రామచంద్రారెడ్డి

● చరిత్రకారుడు డాక్టర్.బి.రామచంద్రారెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్ర విభజన గాయాలు నేటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వెన్నాడుతున్నాయని పుదుచ్చేరికి చెందిన ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ బి.రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతీయవాదం, ప్రాంతీయతత్వ ఉద్యమాలు, దక్షిణ భారతదేం అనే అంశంపై ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపు సభలో మంగళవారం ఆయన మాట్లాడారు. 1913లో మొదలైన ఆంధ్రోద్యమం తెలుగు మాట్లాడే ప్రజలను కలిపి ఉంచడంలో పూర్తిగా సఫలీకృతం కాలేక పోయిందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన ప్రతి సందర్భంలోనూ అనేక ప్రాంతాలను కోల్పోయి ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందన్నారు. మద్రాస్, హైదరాబాద్‌ల కోసం పోరాడే క్రమంలో ఏకంగా వాటిని కోల్పోయి రాజధాని లేని రాష్ట్రంగా మిగిలడం దురదృష్టకరమన్నారు. వెనకబడిన ప్రాంతాల్లోనే ప్రాంతీయవాదం ప్రారంభమతుందని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసినప్పుడు అలాంటి సమస్యలకు తావుండదని వైస్ ఛాన్సలర్ ఎం అంజిరెడ్డి స్పష్టం చేశారు. సభకు డాక్టర్ జి.సోమశేఖర్ అధ్యక్షత వహించగా ఢిల్లీకి చెందిన జేఎన్‌యూ ప్రొఫెసర్ వై.చిన్నారావు, ఏఎన్‌యూ ప్రత్యేకాధికారి డాక్టర్ బి.కృష్ణ, సమన్వయకర్త డి.వెంకటేశ్వరరెడ్డి, చరిత్ర అధిపతి ప్రొఫెసర్ జి.రాజమోహనరావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


నిందితులను అరెస్టు చేసిన సెబ్ పోలీసులు

ఒంగోలు టౌన్: చండీఘర్ రాష్ట్రానికి చెందిన అక్రమ మద్యాన్ని సెబ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నాగులప్పలపాడు మండలంలోని పెదగంజాం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వరరెడ్డి ఆర్మీలో సిపాయిగా పనిచేస్తున్నాడు. గత ఏడాదిగా సెలవులో ఉన్న ఆయన చీరాల మండలం గవినివారి పాలెం గ్రామానికి చెందిన చీదరబోయి సాంబశివరావుతో కలిసి అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారు. చండీగర్ రాష్ట్రానికి చెందిన మద్యాని తక్కువ ధరకు కొనుగోలు చేసి తెచ్చి ఉప్పుగుండూరు ఎస్టీ కాలనీలో ఎక్కువ ధరకు విక్రయిస్తుండగా సెబ్ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన సెబ్ రీఐ బి.లత, ఎస్సై గోపాలకృష్ణ, జేడీ టీం ఎస్సై ఎన్వీ శివప్రసాదరావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ కుప్పాల శ్రీనివాసరావులను సెబ్ జాయింట్ డైరక్టర్ కె.నాగేశ్వరరావు అభినందించారు.

దేవకి వెంకటేశ్వర్లుకు సన్మానం


దేవకి వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న చైర్మన్ గఫార్


కనిగిరి రూరల్: వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షునిగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన దేవకి వెంకటేశ్వర్లును మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులిశాంతి గోవర్ధన్, కౌన్సిలర్లు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ దేవకి వెంకటేశ్వర్లు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటమే కాకుండా కనిగిరికే వన్నె తెచ్చారని కొనియాడారు. తొలుత వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దేవకి లలిత కుమారి దంపతులను సన్మానించారు. వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, అంజమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే ఖాశింసా, విజేత విద్యాసంస్థల అధినేత పి.అరుణోధర్, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


ఆదిలక్ష్మి మృతదేహం

ఒంగోలు టౌన్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగర పరిధిలోని గొడుగుపాలెంలో మంగళవారం జరిగింది. వనటౌన్ పోలీసుల కథనం ప్రకారం ...బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి 20 ఏళ్ల క్రితం నాగులప్పలపాడు గ్రామానికి చెందిన వెంకటరావుతో వివాహమైంది. గత 15 ఏళ్లుగా వీరు నగరంలోని గొడుగుపాలెంలో నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. వెంకటరావు కులవృత్తి చేసుకుంటున్నాడు.ఆదిలక్ష్మి ఇళ్లలో పాచి పనులకు వెళుతుంది. అయితే మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదిలక్ష్మి వంటగదిలో ఉరేసుకొంది. సమాచారం అందుకున్న భర్త వెంకటారావు అక్కడికి చేరుకొని చీరను కోసి రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే ఆమె మృతి చెందింది. భర్త మీద అనుమానంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఆదిలక్ష్మి తల్లి ఇప్పర్తి అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

అంకమ్మ చౌదరికి అభినందనలు


అంకమ్మ చౌదరి

ఒంగోలు టౌన్: నెథర్లాండ్, జర్మనీలో జరిగే 2023 టోర్నీకి భారతీయ జూనియర్ టీమకు మేనేజర్‌గా ఎంపికైన ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరిని ప్రకాశం బ్యాడ్మింటన్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. మంగళవారం అసోసియేషన్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. అంకమ్మ చౌదరి బ్యాడ్మింటన్‌కు మరిన్ని సేవలను అందించాలని అసోసియేషన్ చైర్మన్ మురళి అభిలషించారు. సమావేశంలో ప్రెసిడెంట్ లక్ష్మణరెడ్డి, సెక్రటరీ పావులూరి విజయ్ కృష్ణ,కోశాధికారి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.